క్లుప్తంగా

నిబంధనలు పాటించాలి



రికార్డులను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్

ఆదోనిరూరల్: వ్యవసాయేతర భూములకు ప్రభుత్వ నిబంధనలు తప్పక పాటించాలని ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ అన్నారు. బుధవారం ఆదోని మండలంలోని సలకలకొండ, మదిరె, బల్లేకల్, నారాయణపురం గ్రామాల్లో క్షేత్రస్థాయిలో సబ్ కలెక్టర్ పర్యటించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ.. వ్యవసాయ భూములను వ్యవసాయేతర భూములుగా మార్చుకునేందుకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం గ్రామ లేదా వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకున్న వాటిని నాలా యాక్ట్ ప్రకారం క్షేత్రస్థాయిలో తనిఖీ చేయడం జరుగుతుందన్నారు. ఈయన వెంట మండల సర్వేయర్ రమణ, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ జయరామ్‌రెడ్డి, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

దాడికి పాల్పడిన వారిని సస్పెండ్ చేయాలి

పెద్దకడబూరు: ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణపై అకారణంగా చేయి చేసుకున్న ట్రాఫిక్ పోలీసులు నాగరాజు, పరమేశ్వర్లును సస్పెండ్ చేయాలని ఆ సంఘం జిల్లా కార్యవర్గ సభ్యుడు పరమేష్, మండల కార్యదర్శి తిక్కన్న, సీఐటీయూ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఈరన్న డిమాండ్ చేశారు. కర్నూలు నగరంలో మంగళవారం రోజున రోడ్డుపై వెళుతున్న వ్యక్తిపై అకారణంగా చేయి చేసుకోవడాన్ని మండల కమిటీ తరఫున తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. క్రమశిక్షణతో ఉన్న ఒక నాయకుడిపై పోలీసులు చేయి చేసుకోవడం అనాగరిక చర్య అన్నారు. మద్యం తాగి పోలీసులు ఇలా ప్రవర్తించడం సరికాదన్నారు. దాడికి పాల్పడ్డ పోలీసులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఫీల్డ్ అసిస్టెంట్ల డిమాండ్లు నెరవేర్చాలి

మంత్రాలయం: ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్ల న్యాయమైన కోర్కెలు నెరవేర్చాలని ఫీల్డ్ అసిస్టెంట్ల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వీరేష్‌గౌడ్ కోరారు. బుధవారం మండల పరిధిలోని స్థానిక స్త్రీ శక్తి భవన్‌లో మండల ఫీల్డ్ అసిస్టెంట్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 15 ఏళ్లుగా ఉపాధి హామీ పథకంలో ఫీల్డ్ అసిస్టెంట్లు కీలక పాత్ర పోషిస్తున్నారని గుర్తు చేశారు. వలసల నివారణ, ఉపాధి కల్పనలో కష్టపడుతూ వస్తున్నారన్నారు. శ్రమకు తగ్గ వేతనం నెలకు రూ.26 వేలు చొప్పున ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే ఫీల్డ్ అసిస్టెంట్లకు ప్రమోషన్, జీవిత బీమా, కనీస వేతనం అమలు చేయాలని కోరారు. సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు నారాయణరెడ్డి, బొజ్జప్ప, ఈరన్న, సభ్యులు రంగమ్మ, రాజు, కృష్ణ పాల్గొన్నారు.


ఘనంగా గ్యారతారీఖ్ వేడుకలు



స్వామి వారి సమాధి వద్ద ప్రార్థనలు చేస్తున్న ధర్మకర్త మున్నపాషా చిష్తీ

కౌతాళం: మత సామరస్యానికి ప్రతీకగా వెలుగొందుతున్న జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాలో బుధవారం గ్యారతారీఖ్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని భక్తి శ్రద్ధలతో ప్రత్యేక ఫాతెహాలు నిర్వహించి ప్రార్థనలు చేశారు. మీలాదున్నబీ వేడుకలు కూడా కలిసి రావడంతో దర్గాకు భక్తులు పోటెత్తారు. దర్గా పరిసర ప్రాంతాల్లో భక్తులతో సందడి నెలకొంది. అంతకుముందు తెల్లవారుజామున 5 గంటలకు దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్తీ, పీఠాధిపతి ఖాదర్‌బాష చిష్తీలు స్వామి సమాధికి గంధంతో పూసి ప్రత్యేక ఫాతేహాలు చేపట్టారు.

ఎన్‌సీసీ విద్యార్థుల ర్యాలీ



ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న వైస్ ప్రిన్సిపాల్ జి.సురేష్

ఆదోని సెంట్రల్: ప్రపంచ పర్యాటక దినోత్సవం పురస్కరించుకొని ఆర్ట్స్ కళాశాల ఎన్‌సీసీ విద్యార్థులు బుధవారం ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని ఆర్ట్స్ అండ్ సైన్సు కళాశాల వైస్ ప్రిన్సిపాల్ జి.సురేష్ జెండా ఊపి ప్రారంభించారు. కళాశాల నుంచి పట్టణంలోని తిక్కస్వామి దర్గా వరకు సాగిన ఈ ర్యాలీలో ప్రపంచ పర్యాటక ప్రదేశాలను వివరిస్తూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపాల్ సురేష్ మాట్లాడుతూ దేశంలోని పర్యాటక, చారిత్రక ప్రదేశాలను వివరించారు. ప్రతి ఒక్కరు బావితరాలకు పర్యాటక ప్రదేశాలను వివరించాల్సిన అవసరం ఎంతైన ఉందన్నారు. సీనియర్ అధ్యాపకులు చంద్రశేఖర్, బాలస్వామి, రామకృష్ణ కళాశాల ఎన్‌సీసీ అధికారి కె.గోవిందు తదితరులు పాల్గొన్నారు.

అందరి సహకారంతో ఓటరు జాబితా ప్రక్షాళన

- పోలింగ్ స్టేషన్ల హేతుబద్ధీకరణ కోసం ప్రతిపాదనలు
- సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్





మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్, హాజరైన అధికారులు

ఆదోనిరూరల్: లోపాలు లేని ఓటరు జాబితాను రూపొందించేందుకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని ఆదోని నియోజకవర్గ అధికారి, సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ కోరారు. ఆదోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో బుధవారం రాత్రి 7 గంటల సమయంలో ఓటరు జాబితాపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఓటరు జాబితా ప్రక్షాళనకు రాజకీయ పార్టీలకు అతీతంగా సహకరించాలన్నారు. ప్రస్తుతం ఆదోని నియోజకవర్గంలో 256 పోలింగ్ స్టేషన్లు ఉండగా వాటిలో 24 పోలింగ్ స్టేషన్‌లకు సదుపాయాలు సరిగా లేనందువల్ల కొత్త పోలింగ్ స్టేషన్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు వచ్చాయన్నారు. 24 పోలింగ్ స్టేషన్‌లకు లొకేషన్ మార్పునకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామన్నారు. పోలింగ్ స్టేషన్ల మార్పునకు సంబంధించి ఏవైనా సూచనలు ఉంటే తెలియజేయవచ్చని, ఈఆర్వోలు పరిశీలించి తగిన నివేదికలు ఇస్తారని సబ్ కలెక్టర్ రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచించారు. పోలింగ్ స్టేషన్లు సాధ్యమైనంత వరకు ప్రభుత్వ భవనాల్లో ఉండేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. పోలింగ్ స్టేషన్లలో ర్యాంపు, టాయ్‌లెట్ విత్ రన్నింగ్ వాటర్, విద్యుత్ సౌకర్యం ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు. కుటుంబ సభ్యులందరూ ఒకే పోలింగ్ స్టేషన్‌లో ఓటు హక్కు వినియోగించుకునేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అనంతరం మున్సిపల్ కౌన్సిల్‌హాల్‌లో ఎలక్షన్ సూపర్‌వైజర్లు, బీఎల్‌ఓలకు స్పెషల్ సమ్మర్ రివిజన్, పోలింగ్ స్టేషన్ హేతుబద్ధీకరణలో భాగంగా ఒక కుటుంబం–ఒకే పోలింగ్ స్టేషన్‌కు ఓటు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని సూపర్‌వైజర్‌లకు, బీఎల్‌ఓలకు సబ్‌కలెక్టర్ సూచించారు. తహసీల్దార్ వెంకటలక్ష్మి, డిప్యూటీ తహసీల్దార్లు రజనీకాంత్‌రెడ్డి, ఎజాజ్‌అహ్మద్, మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ అనుపమ తదితరులు పాల్గొన్నారు.

అమర వీరుల త్యాగాలు మరువలేం

పెద్దకడబూరు: దేశ రక్షణ కోసం ప్రాణాలు అర్పించిన మహనీయులు, అమర వీరుల త్యాగాలు మరువలేమని ప్రధానోపాధ్యాయురాలు ఉమారాజేశ్వరి అన్నారు. నా మట్టి – నా దేశం కార్యక్రమంలో భాగంగా బుధవారం మట్టి సేకరణ కార్యక్రమం చేపట్టారు. ప్రతి ఇల్లు, వార్డు, ప్రతి విద్యార్థి నివాస పరిసరాల నుంచి మట్టిని సేకరించారు. సేకరించిన మట్టిని చిన్న కలశం(కుండ)లో నింపి స్థానిక ఉన్నత పాఠశాల నుంచి భారీ ర్యాలీగా అమృత కలశ యాత్ర చేపట్టారు. ప్రభాతభేరి ఊరేగింపులో జాతీయ జెండా, మేరీ మట్టి మేరీ దేశ్ బ్యానర్‌ను ప్రదర్శిస్తూ, జాతీయ నాయకులు (అమర వీరుల) ఫోటోలతో బస్టాండ్ ఆవరణం చేరుకున్నారు. అక్కడ మానవహారంగా ఏర్పడి దేశం కోసం ప్రాణాలు అర్పించిన మహనీయులను స్మరించుకున్నారు. జోహార్లు తెలుపుతూ ఎంపీడీఓ కార్యాలయాన్ని చేరుకున్నారు. అనంతరం ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ప్రభాకర్‌కు అమృత కలశాన్ని అందజేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడా పోటీల్లో సత్తా చాటాలి



క్రీడాకారులతో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

ఆదోని సెంట్రల్: రాష్ట్ర, జిల్లా స్థాయిలో జరిగే క్రీడా పోటీల్లోనూ సత్తా చాటాలని ప్రధానోపాధ్యాయురాలు ఇందిరాదేవి క్రీడాకారులకు సూచించారు. పెద్ద హరివాణం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు నియోజకవర్గ స్థాయిలో జరిగిన స్కూల్ గేమ్స్ క్రీడా పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ఓవరాల్ చాంపియన్‌గా నిలిచారు. ఈ సందర్భంగా వారిని బుధవారం అభినందించారు. వారు మాట్లాడుతూ.. అండర్–17, అండర్–14 విభాగంలోని బాలురు, బాలికల జట్లు కబడ్డీ పోటీల్లో విజయం సాధించారని పేర్కొన్నారు. అండర్–17 ఖోఖో పోటీల్లో బాలుర జట్టు విజయం సాధించగా అండర్–14 లో బాలుర జట్టు రన్నర్‌గా నిలిచిందని తెలిపారు. అండర్–14 వాలీబాల్ పోటీల్లో బాలికల జట్టు రన్నర్‌గా నిలిచిందని పేర్కొన్నారు. వాలీబాల్, డిస్కత్రో, హైజంప్ పరుగు పందెం వంటి పోటీల్లో ప్రతిభ కనబరచి గ్రామానికి, పాఠశాలకు మంచి పేరు తీసుకురావడం అభినందనీయమన్నారు. ఉపాధ్యాయులు చిరంజీవి, శివగౌడు, నరేంద్ర, మంజుల, క్రిష్ణవేణి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రూ.3 కోట్లతో 46 అభివృద్ధి పనులకు ఆమోదం



కమిషనర్‌కు సమస్యలను వివరిస్తున్న కౌన్సిలర్ రఘునాథ్ రెడ్డి

ఆదోనిటౌన్: ఆదోని మున్సిపల్ కౌన్సిల్ రూ.3 కోట్లతో చేపట్టబోయే 46 అభివృద్ధి పనులకు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. ఆదోని అభివృద్ధే లక్ష్యంగా ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి, చైర్‌పర్సన్ శాంత, అధికార యంత్రాంగంతో పాటు పాలకవర్గం ముందుకెళ్తోంది. బుధవారం చైర్‌పర్సన్ బోయ శాంత అధ్యక్షతన కౌన్సిల్ హాల్‌లో సమావేశం జరిగింది. మున్సిపల్ జనరల్ ఫండ్స్, 14, 15వ ఆర్థిక సంఘం నిధులు దాదాపు రూ.3 కోట్లతో చేపట్టబోయే అభివృద్ధి పనులకు కౌన్సిల్ ఆమోదంకోసం అజెండాను ప్రవేశపెట్టారు. పాలకవర్గ సభ్యులు ఆమోద ముద్ర వేశారు. ప్రతి వార్డు, సందు, వీధి, గల్లీగల్లీన అభివృద్ధి పనులు, సీసీ రోడ్లు, మురుగు కాలువలు, తాగునీటి వసతి, వీధి దీపాలు తదితర మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా పాలకవర్గ సభ్యులు అధికారులకు సహకారం అందించారు. అజెండాలో ప్రవేశపెట్టిన 49 అంశాలలో మూడు శానిటేషన్ సెక్షన్‌కు సంబంధించినవి కాగా, మిగతా 46 అభివృద్ధి పనులకు సంబంధించినవి. మొత్తం 49 అంశాలకు ఆమోదం తెలపడంతో అభివృద్ధి మరింతగా జరగనుంది.

బసాపురం ఎస్‌ఎస్ ట్యాంకు మెయింటెనెన్స్‌కు నిధులు కేటాయించాలని కౌన్సిలర్లు రఘునాథ్ రెడ్డి, బాలాజీయాదవ్, సురేష్ అధికారులను కోరగా జనరల్ ఫండ్స్‌ను కేటాయిస్తామని కమిషనర్ రఘునాథ్ రెడ్డి సమాధానమిచ్చారు. 1వ వార్డు వాల్మీకి నగర్‌లో డ్రైనేజీలు, రోడ్లు నిర్మించాలని సభ్యురాలు పార్వతి అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. అలాగే దోమలు అధికంగా ఉన్నాయని, ఫాగింగ్ చేయాలని కోరారు. నెలకోసారి జరిగే కౌన్సిల్ మీటింగ్‌కు విద్యుత్, పోలీసు, రెవెన్యూ, అంగన్‌వాడీ తదితర శాఖల అధికారులు తప్పకుండా హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని సభ్యులు కోరారు. గతంలో ట్రాఫిక్ సిగ్నల్స్ కోసం రూ.20 లక్షలు కేటాయించారని మళ్లీ రూ.18 లక్షలు కేటాయించడంపై ఆరా తీయాలని రఘునాథ్ రెడ్డి, బాలాజీ అధికారులను కోరారు. గతంలో ఏర్పాటు చేసిన సిగ్నల్స్ పనిచేయడం లేదని, రోడ్లపై దిష్టిబొమ్మల్లా వేలాడుతున్నాయని చెప్పారు. పట్టణంలో 250–300 దాకా చేతిపంపులు, మినీ వాటర్ స్కీంలు ఉన్నాయని, వాటి మెయింటెనెన్స్ లేక ట్యాంకులకు రంధ్రాలు పడి నీరంతా లీకేజీలు అయ్యి మురుగు కాలువల్లోకి ప్రవహిస్తున్నాయని అధికారుల దృష్టికి సభ్యులు తీసుకొచ్చారు. వాటిని పరిశీలించి వారం, పది రోజుల్లోగా సమస్యను పరిష్కరిస్తామని వాటర్ వర్క్స్ ఏఈ రాజశేఖర్ రెడ్డి సభ్యులకు సమాధానంగా చెప్పారు. తాగునీటి సరఫరా తెల్లవారుజామున 3, 4 గంటలకు తాగునీరు సరఫరా చేస్తున్నారని ఉదయం 5 లేదా 6 గంటలకు సరఫరా చేయాలని బాలాజీ అధికారులను కోరగా సానుకూలంగా స్పందించారు. 22వ తేదీన జరిగిన వినాయక నిమజ్జనం ప్రశాంతంగా జరిగిందని, అందుకు సహకరించిన మున్సిపల్, శానిటరీ సెక్షన్ అధికారులు, సిబ్బంది, పోలీసులు, విద్యుత్‌శాఖ, ఆర్ అండ్‌బీ తదితర శాఖల అధికారులకు పాలకవర్గం ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేసింది. సమావేశంలో వైస్ చైర్మన్లు గౌస్, నరసింహులు, ఎంఈ రవి, డీఈలు, ఏఈలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్‌లు, మెప్మా ప్రాజెక్టు అధికారిణి షనాభాను, ఎలక్ట్రికల్, టీపీఓ తదితరులు పాల్గొన్నారు.

యార్డులో వేరుశనగ క్రయవిక్రయాలు చేపట్టాలి



యార్డు అధికారులకు వినతి పత్రం అందజేస్తున్న ఏపీ రైతు సంఘం నాయకులు

ఆదోనిరూరల్: ఆదోని మార్కెట్ యార్డులో వేరుశనగ కొనుగోళ్లు వెంటనే ప్రారంభించాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కె.వెంకటేశులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన మాట్లాడుతూ.. గత వారం రోజులుగా ఆదోని మార్కెట్ యార్డులో వేరుశనగ అమ్మకాలు నిలిచిపోయాయని, దీంతో రైతులు ఎక్కువ ఖర్చు పెట్టుకుని ఎమ్మిగనూరు, కర్నూలు మార్కెట్ యార్డులకు తీసుకెళ్లి అమ్మకాలు చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఫ్యాక్టరీలో పనిచేసే కార్మికులు వారి వేతనాల కోసం సమ్మె చేస్తే మార్కెట్ యార్డులో వేరుశనగ అమ్మకాలకు సంబంధం ఏంటని ఆయన ప్రశ్నించారు. ఇప్పటికైనా కమీషన్ ఏజెంట్లు వెంటనే కొనుగోళ్లు ప్రారంభించాలని డిమాండ్ చేశారు.అలాగే మార్కెట్‌యార్డులో రైతులకు ఉచిత భోజన వసతి ఏర్పాటు చేయాలన్నారు. లేనిపక్షంలో రైతు సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తామన్నారు. అనంతరం మార్కెట్‌యార్డు కార్యాలయంలో అధికారులకు వినతి పత్రం అందజేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కె.లింగన్న, రైతుసంఘం మండల కార్యదర్శి అయ్యప్ప, మండల నాయకులు చిన్నతిక్కన్న, హనుమంతరెడ్డి, రామాంజనేయులు, చిన్నా తదితరులు పాల్గొన్నారు.

నేరస్తులను కఠినంగా శిక్షించాలి



సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న వడ్డెర సంఘం నాయకులు

ఆదోనిరూరల్: చిత్తూరు జిల్లా పెనుమూరు మండలం వేణుగోపాలపురం గ్రామంలో వడ్డె భవ్యశ్రీ అనే ఇంటర్మీడియెట్ విద్యార్థిని కిడ్నాప్ చేసి, హత్యాచారం చేసిన వారిని కఠినంగా శిక్షించాలని అఖిల భారత వడ్డె ఓబన్న సేవాసమితి జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు వడ్డెర కులస్తుల ఆధ్వర్యంలో బుధవారం సబ్‌కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెనకబడిన వడ్డెర కులస్తులకు రక్షణ లేక ప్రతినిత్యం ఇటువంటి సంఘటనలు ఏదో ఒకచోట జరుగుతూనే ఉన్నాయన్నారు. ఇకపై ఇలాంటి సంఘటనలు జరగకుండా హంతకులను పట్టుకుని కఠినంగా శిక్షించాలన్నారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలకు దిగుతామని హెచ్చరించారు. వడ్డెర సంఘం నాయకులు వడ్డె హనుమంతు, మహాదేవ, నాగరాజు, నరసింహులు, మల్లికార్జున, లింగప్ప, తిమ్మప్ప, చిదానంద, తిక్కన్న తదితరులు పాల్గొన్నారు.

పిల్లలను బడిలో చేర్పించాలి



నాడు–నేడు పనులను పరిశీలిస్తున్న ఎస్‌ఎస్‌ఏ ఏపీసీ వేణుగోపాల్

కోసిగి: బడి ఈడు పిల్లలను గుర్తించి బడిలో చేర్పించాలని జిల్లా సమగ్ర సర్వశిక్ష అభియాన్ అడిషనల్ ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్ వేణుగోపాల్ సూచించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్, ఎంఈఓ మెయినుద్దీన్ ఆధ్వర్యంలో వెల్ఫేర్ అసిస్టెంట్, సీఆర్‌పీలు, వలంటీర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోనే కోసిగి మండలంలో అత్యధికంగా మధ్యలో బడి మానేసిన పిల్లలు ఉన్నారన్నారు. 18 ఏళ్ల లోపు పిల్లలందరినీ బడిలో చేర్పించేలా చూడాలన్నారు. వలంటీర్లు తమ కేటాయించిన ఇళ్లలో బడి మానేసిన పిల్లలు ఉంటే గుర్తించి సమాచారం ఇవ్వాలని సూచించారు. అనంతరం కోసిగిలో ఏపీ మోడల్ స్కూల్, రంగప్ప గట్టు స్కూల్‌లలో జరుగుతున్న నాడు–నేడు పనులు పరిశీలించారు. సీఆర్‌పీలు, ఉపాధ్యాయులు ఉన్నారు.

నిధులు రికవరీ చేయండి



రికార్డులు పరిశీలిస్తున్న ఎన్‌ఆర్‌జీఎస్ ఏపీడీ లోకేశ్వర్

కోసిగి: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో జరిగిన అక్రమాలపై సోషల్ ఆడిట్‌లో లెక్కగట్టిన సొమ్మును వెంటనే రికవరీ చేయించాలని ఎన్‌ఆర్‌జీఎస్ ఏపీడీ లోకేశ్వర్, క్లస్టర్ లెవెల్ కోర్స్ డైరెక్టర్ ఆదినారాయణ సూచించారు. బుధవారం స్థానిక ఎన్‌ఆర్‌ఈజీఎస్ కార్యాలయంలో ఫీల్డు అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. వ్యవసాయ సీజన్ కావడంతో కూలీలు వ్యవసాయ పనులు చేసుకుంటున్నారన్నారు. హార్టికల్చర్ కింద పండ్లతోటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. అలాగే జగన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలు చేసుకున్న వారికి ఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద బిల్లులు వెంటనే ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయించాలని ఫీల్డు అసిస్టెంట్లకు సూచించారు. జాబ్‌కార్డు లేని వారికి మంజూరు చేయించాలని సూచించారు. క్లస్టర్ టెక్నికల్ అసిస్టెంట్ గిడ్డయ్య,ఏపీఓ జయరాం,సిబ్బంది పాల్గొన్నారు.

సీఎస్‌ఐ చర్చి వార్షికోత్సవం



మాట్లాడుతున్న పాస్టర్ వేదనాయకం బాబు

మంత్రాలయం: మండల కేంద్రంలో సీఎస్‌ఐ చర్చి నెలకొల్పి 76 ఏళ్లు ముగిసిన సందర్భంగా వార్షికోత్సవం చేపట్టారు. బుధవారం చర్చి పాస్టర్ వేదనాయకం బాబు ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేపట్టి పట్టణంలో బైకు ర్యాలీ చేశారు. సీఎస్‌ఐ చర్చి పురోగతిపై పాస్టర్ వివరించారు. స్థానిక చర్చి నుంచి రాఘవేంద్ర సర్కిల్ మీదుగా ర్యాలీ చేపట్టారు. వేడుకలో మాధవరం చర్చి పాస్టర్ పురుషోత్తం బాబు, సంఘ పెద్దలు దేవదాసు, ప్రభుదాసు, కుమార్, కయ్యోన్, సుందరరాజు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ

కౌతాళం: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ప్రభుత్వం సూచించిన మెను ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలని ఎంపీడీఓ సుబ్బరాజు ఆదేశించారు. ఆయన బుధవారం కౌతాళంలోని ఎస్‌డబ్ల్యూ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి భోజనం రుచి, నాణ్యతపై ఆరా తీశారు. అనంతరం ఉపాధ్యాయుల హాజరు పుస్తకంను పరిశీలించి ప్రధానోపాధ్యాయుడు శివకుమార్‌తో మాట్లాడి నిర్వహణ వివరాలను అడిగి తెలుసుకున్నారు. సర్పంచ్ పాల్‌దినకర్, పంచాయతీ కార్యదర్శులు చెన్నయ్య, ఆంజినేయులు ఉన్నారు.

పాలిటెక్నిక్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

ఆదోనిఅర్బన్: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో అక్టోబర్ 3వ తేదీన స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.సుధాకర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్పాట్ అడ్మిషన్ల కౌన్సెలింగ్‌కు పాలిసెట్–2023లో అర్హత సాధించిన వారు, ఉత్తీర్ణులు కానివారు, పదో తరగతి పాసైన వారు హాజరుకావాలన్నారు. తమ కళాశాలలో ఈఈఈ, ఈసీఈ కోర్సులు అందుబాటులో ఉన్నట్లు చెప్పారు. స్పాట్ అడ్మిషన్లకు హాజరయ్యే అభ్యర్థులు ఎస్‌ఎస్‌సీ మార్క్స్ మెమో ఒరిజినల్, 4వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదివిన స్టడీ సర్టిఫికెట్లు, టీసీ, కేటగిరీ సర్టిఫికెట్, పాలిసెట్ ర్యాంకు కార్డు, పాలిసెట్–2023 హాల్‌టికెట్, ప్రాసెసింగ్ ఫీజు రూ.900తో అక్టోబర్ 3వ తేదీన ఉదయం 10 గంటలకు విరుపాపురం వద్ద ఉన్న కళాశాలలో హాజరుకావాలన్నారు. స్పాట్ అడ్మిషన్‌లకు హాజరై సీటు పొందిన అభ్యర్థులు ట్యూషన్ ఫీజు రూ.4,700 వెంటనే చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 29వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

డ్రైనేజీ, సీసీ రోడ్డు పనులు ప్రారంభం



డ్రైనేజీ పనులు చేపట్టిన దృశ్యం

కౌతాళం: గత 20 సంవత్సరాలుగా ఉన్న డ్రైనేజీ సమస్యకు పరిష్కారం లభించిందని వైస్ ఎంపీపీ బుజ్జిస్వామి అన్నారు. కామవరం రస్తాలోని ఎస్సీ కాలనీకి పోవాలంటే చాలా ఇబ్బందులు ఉండేవని డ్రైనేజీ లేకపోవడంతో మురికి నీరంతా రోడ్డుపై ప్రవహించేది దీంతో కాలనీ వాసులు ఇబ్బందులు పడేవారని చెప్పారు. సమస్యను ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో మండల పరిషత్ గ్రాంట్ నిధులు మంజూరు చేయడంతో వెంటనే డ్రైనేజీ, సీసీ రోడ్డు పనులు ప్రారంభించినట్లు తెలిపారు. ఈ పనులను త్వరలోనే పూర్తి చేస్తామని వెల్లడించారు.

భూసమస్య పరిష్కరించడం లేదని ఆత్మహత్యాయత్నం

కోసిగి: పొలం సమస్య పరిష్కారం కాలేదని, తనకు సంక్రమించిన భూవిస్తీర్ణం, పట్టాదారు పాసుపుస్తకంలో తేడా ఉందనే మనస్తాపంతో తహసీల్దార్ కార్యాలయంలో ఓ మహిళ ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు ప్రయత్నించింది. వివరాలు.. వందగల్లు గ్రామానికి చెందిన సరస్వతి, ఆమె తమ్ముళ్లకు సర్వే నంబర్ 180 సిలో 2.90 ఎకరాల భూమి వారసత్వంగా వచ్చిందన్నారు. అయితే 2.31 ఎకరాలు మాత్రమే పాసుపుస్తకంలో నమోదు చేశారన్నారు. మిగతా 59 సెంట్లకు సంబంధించి తహసీల్దార్‌కు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తూ బుధవారం రెవెన్యూ కార్యాలయంలో వెంట తెచ్చుకున్న పెట్రోల్‌ను ఒంటిపై పోసుకుంది. అక్కడున్న సిబ్బంది ఆమెను అడ్డుకున్నారు. కాసేపటికి ఆమె అపస్మారక స్థితిలో కిందపడిపోవడంతో కోసిగి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ విషయంపై తహసీల్దార్ రుద్రగౌడను వివరణ కోరగా.. ఇందులో సరస్వతి, తమ్ముళ్ల పేరిట సర్వే నంబర్ 180 సిలో 2.31 ఎకరాల భూమి ఉందన్నారు. ఆమె పక్క పొలం సాగులో ఉన్న మజ్జిగ కోసిగమ్మకు సంబంధించి సర్వే నెంబర్ 187గా నమోదై ఉందని చెప్పారు. ఆమె పొలం అందులో నుంచి నుంచి 59 సెంట్లు ఇప్పించాలని సరస్వతి అర్జీ పెట్టుకుందన్నారు. మండల సర్వేయర్‌తో కలిసి మరోసారి సర్వే చేయించి సమస్య ఉంటే సివిల్ కోర్టుకు వెళ్లమని చెప్పామన్నారు. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తహసీల్దార్ తెలిపారు.

ఆరోగ్య సురక్షతో రోగాలకు చెక్



పల్లెపాడులో ప్రజలకు వైద్య పరీక్షలు చేసి వివరాలను నమోదు చేస్తున్న ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు




లింగాలదిన్నెలో రోగులకు పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

ఆదోనిటౌన్: పేదల ఆరోగ్యమే మహాభాగ్యంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం భావిస్తూ ఇంటింటికీ వెళ్లి ఆరోగ్య సర్వే చేస్తోంది. ఇంట్లో దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు ఎవరైనా ఉన్నారా లేదా అని గుర్తిస్తున్నారు. ఉన్న వారికి ఉచితంగానే బీపీ, షుగర్ పరీక్షలు చేస్తున్నారు. ఆరోగ్యం సరిగాలేని వారిని గుర్తిస్తూ ఈనెల 30వ తేదీన చేపట్టబోయే ప్రత్యేక శిబిరాల్లో వైద్యం అందించనున్నారు. బుధవారం ఆదోని పట్టణంలోని 39 వార్డుల్లో 'జగనన్న ఆరోగ్య సురక్ష' సర్వే కార్యక్రమం జరిగింది. అలాగే మండలంలోని 37 గ్రామ పంచాయతీలు, ఆరు మజారా గ్రామాల్లో సర్వే జరిగింది. సర్వేతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. 30వ తేదీ తర్వాత ఆయా రోగాలకు సంబంధించి ఉచితంగానే వైద్యం అందించడంతో పాటు మందులు పంపిణీ చేయనున్నారు.

కౌతాళం: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రభుత్వం ప్రతి ఒక్కరికీ ఆరోగ్య పరీక్షలు చేయించి ఉచితంగా వైద్యం అందిస్తుందని కౌతాళం పీహెచ్‌సీ వైద్యుడు మనోజ్, బదినేహాల్ పీహెచ్‌సీ వైద్యాధికారి ఇమ్మానియేల్ కోరారు. సర్వేలో భాగంగా ఇంటింటికీ వెళ్లి కుటుంబ సభ్యులందరికీ బీపీ, షుగర్, థైరాయిడ్, గళ్ల పరీక్షలు చేసి వివరాలు నమోదు చేస్తున్నట్లు తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లో సర్వే దాదాపు పూర్తి చేశామన్నారు.

కోసిగి: ప్రజల ఆరోగ్యమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇంటి వద్దకే వైద్య సేవలు అందిస్తున్నట్లు కోసిగి పీహెచ్‌సీ వైద్యాధికారి మనోజ్‌కుమార్ తెలిపారు. బుధవారం కోసిగిలో ఆరోగ్య సురక్ష సర్వే నిర్వహించి ప్రజల ఆరోగ్య వివరాలు నమోదు చేసుకున్నారు. స్వల్పంగా జ్వరాలు, ఇతర వ్యాధులతో బాధపడుతున్న వారికి బీపీ, షుగర్ టెస్టులు నిర్వహించి అవసరం మేరకు మందులు అందించారు.సీహెచ్‌ఓ గిరి, ఏఎన్‌ఎమ్ , ఆశా వర్కర్‌లు పాల్గొన్నారు.


ప్రభుత్వ సేవలు అభినందనీయం



ప్రభుత్వం ఆరోగ్య సిబ్బంది ద్వారా ప్రతి ఇంటికీ వెళ్లి సర్వే చేపట్టడం అభినందనీయం. ఎవరెవరికి ఏ జబ్బులు ఉన్నాయో ముందస్తుగా తెలిసిపోతోంది. వారికి అవసరమైన సేవలు వైఎస్సార్ క్లీనిక్‌ల ద్వారా అందించనున్నారు. ఇక ఇంటి ముంగిటకే వైద్యం అందనుంది. వైద్య, విద్య రంగాల్లో ప్రభుత్వాలు పెను మార్పులు చేయడంతో పాటు పగడ్బందీగా అమలు చేస్తుండడం హర్షణీయం. ఇలాంటి ప్రభుత్వం మునుపెన్నడూ చూడలేదు.

– బసవరాజు, ఆదోని

పకడ్బందీగా సర్వే



ఈనెల 16వ తేదీ నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే ప్రతి గడపలోనూ పకడ్బందీగా జరుగుతోంది. సర్వేలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం. కొన్ని ఏరియాల్లో డాక్టర్లతో పాటు ఏఎన్‌ఎం, ఆశావర్కర్లు, వలంటీర్లు కూడా సర్వేలో పాల్గొంటున్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి ఆరోగ్య సమాచారం సేకరిస్తున్నారు. జబ్బులున్న వారికి ఈ నెల 30వ తేదీ తర్వాత ప్రారంభమయ్యే వైద్య శిబిరాల్లో మెరుగైన వైద్యం అందిస్తాం.

– సత్యవతి, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ

కోట్ల విజయభాస్కర్ రెడ్డికి నివాళి

ఆదోనిఅర్బన్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కోట్ల విజయభాస్కర్ రెడ్డి 22వ వర్ధంతి కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని విజయభాస్కర్ రెడ్డి విగ్రహానికి వ్యవసాయ మార్కెట్ యార్డు మాజీ ఉపాధ్యక్షుడు రాయచోటి సుబ్బయ్య, మాజీ సర్పంచ్ బి.సోమశేఖర్‌రెడ్డి, మాజీ శాసన మండలి సభ్యులు చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కోట్ల విజయభాస్కర్ రెడ్డి దేశంలోనే నిజాయితీ పరుడిగా పేరు, ప్రఖ్యాతులు పొందారన్నారు. మనమంతా ఆయన బాటలో నడవాలని పిలుపునిచ్చారు. అర్బన్ బ్యాంకు సీఈఓ గట్టు మురళీకుమార్, నసీరుద్దీన్ పటేల్, డాక్టర్ శివారెడ్డి, చంద్రశేఖర్, హనుమంత రెడ్డి, నీలకంఠప్ప, సుగూరప్ప, మల్లికార్జునస్వామి తదితరులు పాల్గొన్నారు.